క్లుప్తంగా

గ్రామాల్లో వైద్య శిబిరాలు



మేడివాడలో రోగులను పరీక్షిస్తున్న సిబ్బంది

రావికమతం: తుఫాన్ ప్రభావంతో నిరంతరాయంగా వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు ఎటువంటి రోగాల బారిన పడకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా రావికమతం పీహెచ్‌సీ పరిధి గ్రామాల్లో బుధవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ప్రజలకు జ్వరాలు ఇతర సమస్యలేమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు చేసి మందులు అందించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు



సంక్షేమ, అభివృద్ధి పనుల బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ అప్పలనర్స

నాతవరం: రాజకీయాలకతీతంగా ప్రజలకు సంక్షేమ లబ్ధిని కల్పిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ఎల్లప్పుడూ అండగా ఉండాలని జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స తెలిపారు. మండలంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం బుధవారంతో ముగిసింది. చివరి రోజు కార్యక్రమం నాతవరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో చేసిన సంక్షేమం, అభివృద్ధి పనులను వివరించే బోర్డును గ్రామ సచివాలయం వద్ద జెడ్పీటీసీ అప్పలనర్స ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే గణేష్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, సర్పంచ్ గొలగాని రాణి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, ఎంపీటీసీలు ప్రభావతి, రేణుక, నాయకులు పాల్గొన్నారు.

మామిడిపల్లిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' నేడు

దేవరాపల్లి: మామిడిపల్లిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే, జగనన్న నువ్వే మా నమ్మకం, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఓటు హక్కు నమోదుపై దృష్టి సారించండి

వైస్ ఎంపీపీ రాజారామ్

మాడుగుల: మండలంలో ఈ నెల 9వ తేదీతో ఓటు హక్కు నమోదు గడువు పూర్తవుతుందని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వచ్చే జనవరి ఒకటో తేదీకి 18 ఏళ్లు నిండిన వారిని కొత్త ఓటు హక్కు నమోదు చేయించే బాధ్యత గ్రామాల్లో పార్టీ నాయకులు తీసుకోవాలన్నారు. ఓటరు జాబితా నుంచి మృతి చెందిన వారి వివరాలు తొలగించేందుకు కృషి చేయాలన్నారు. రెండు రోజుల్లో ఓటు నమోదు గడవు పూర్తవుతున్నందున ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

పాడి గేదె మృతి



పాడి గేదె కళేబరం

రావికమతం: కొత్తకోట గ్రామానికి చెందిన వీరవిల్లి ఈశ్వరరావుకు చెందిన పాడిగేదెపై పాక రాట బలంగా పడటంతో బుధవారం మృతి చెందింది. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు పశువుల పాక రాటలు ఒరిగిపోయాయి. దీంతో రాటకు కట్టిన పాడిగేదె కన్ని పీకకు బిగుసుకుపోయి ఊపిరాడక మృతి చెందింది. దాంతో పాడిరైతు కన్నీరు మున్నీరయ్యాడు. వీఆర్వో లక్ష్మి పరిశీలించారు.

వర్షార్పణం

మిచాంగ్ తుఫాన్ అతలాకుతలం చేసింది. ఈ ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామాలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు నీటమునిగాయి. వర్షాలకు నదులు, గెడ్డలు, కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల చెట్లు నేలకూలాయి. వాహన రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్తు స్తంభాలు ఒరిగి, తీగలు తెగిపడి సరఫరా నిలిచిపోవడంతో సంబంధిత సిబ్బంది పునరుద్ధరణ చర్యలు తీసుకున్నారు. అధికార యంత్రాంగం విస్తృతంగా పర్యటించి సహాయక చర్యలు చేపట్టింది. వ్యవసాయాధికారులు రైతులకు సూచనలు, సలహాలు అందించారు.

- 'మిచాంగ్' ప్రభావంతో ఎడతెరిపిలేని వర్షం
- నీటి మునిగిన పంటలు
- పొంగి ప్రవహిస్తున్న గెడ్డలు, కాలువలు, నదులు
- అధికారుల ముమ్మర సహాయక చర్యలు



బుచ్చెయ్యపేట: లోపూడిలో వరి కుప్పల చుట్టూ చేరిన వర్షం నీరు



బుచ్చెయ్యపేట: ఐయితంపూడిలో కూలిన ప్రహరీ



చోడవరం రూరల్: ముంపునకు గురైన పొలాలను పరిశీలిస్తున్న దృశ్యం



కె.కోటపాడు: మొండిగెడ్డ కాజ్‌వేపై వర్షపునీటిని పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్‌బాబు



రావికమతం: దొండపూడిలో పొలాలపై నుంచి పారుతున్న నీటిని పరిశీలిస్తున్న ఏవో రూప



మాడుగుల మండలం గాదిరాయిలో మునిగిన వరి పంట తీసి కట్టలు కడుతున్న రైతు



నాతవరం:వై.బి.అగ్రహారం గ్రామానికి వెళ్లే వంతెనపై నీటి ప్రవాహం



రావికమతం: జెడ్.కొత్తపట్నంలో నీట మునిగిన వరిని పరిశీలిస్తున్న తహసీల్దార్ మహేశ్వరరావు



నర్సీపట్నం: ఆర్డీవో కార్యాలయం కారడటంతో ఖాళీ అయిన పరిపాలన విభాగం



చీడికాడ: అడివి అగ్రహారంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తున్న సిబ్బంది

నర్సీపట్నం: పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన శ్రీరామ్‌నగర్, శారదనగర్, బ్యాంక్‌కాలనీ పూర్తిగా జలమయమయ్యాయి. ఇళ్ల చుట్టూ వర్షం నీరు ఆవరించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెయిన్ రోడ్డుపై చెట్టు విరిగిపడింది. ఆర్డీవో జయరాం అక్కడకు చేరుకుని విద్యుత్, అర్‌అండ్‌బీ, పోలీసు సిబ్బంది సహకారంతో చెట్టును తొలగించారు. పురాతన ఆర్డీవో కార్యాలయ భవనం పూర్తిగా కారిపోయింది. కంప్యూటర్లు, రికార్డులు తడిసిపోయాయి. ఏడీఏ శ్రీదేవి స్వయంగా సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించారు. 10 వేల హెక్టార్లలో రైతులు వరి పంట వేశారు. తుఫాన్ కారణంగా 1,074 హెక్టార్లలో వరి పంట నీటమునిగింది. మరో 1,408 హెక్టార్లలో పంట పడిపోయింది. 757 హెక్టార్లలో కోతలయ్యాయి. 181 హెక్టార్లలో పంట కోశారు. 449 హెక్టార్లలో కోసిన పంట కుప్పల మీద పొలంలో ఉంది. 46 హెక్టార్లలో కోసిన వరి పనల మీద ఉంది. 60 వేల హెక్టార్లలో కోసిన పంటను, నూర్పిడి చేసినట్లు ప్రాథమిక అంచనా వేశారు.

నర్సీపట్నం – తుని మధ్య నిలిచిన రాకపోకలు

నాతవరం: కొండ గెడ్డ నీరు ములగపూడి గ్రామం వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుపై పొంగి ప్రవహించడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎక్కడా ప్రాణనష్టం వాటిల్లకుండా తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు, ఎంపీడీవో హనుమంత్‌రావు, ఎస్ఐ రామారావు ప్రత్యేక చర్యలు చేపట్టారు. తాండవ రిజర్వాయరుపై ప్రాజెక్టు డీఈ అనురాధ ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీటిని పరిశీలిస్తూ దిగువ ప్రాంత ప్రజలకు హెచ్చరికలు చేశారు.

ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన

ముంపు ప్రభావిత గ్రామాల్లో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ బుధవారం సుడిగాడి పర్యటన చేశారు. ఎ.శరభవరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఏలేరు కాలువను ఆయన పరిశీలించారు. జన్నవరం మెట్ట వద్ద వెదుళ్లగెడ్డ ఉప్పొంగి ప్రహించడంతో నర్సీపట్నం-తుని మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఈ ప్రాంతాన్ని పరిశీలించి నీటి ప్రవాహం తగ్గేంతవరకూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వై.బి.అగ్రహారం, శృంగవరం, గాంధీనగరం గ్రామాల్లో వరి పంటను పరిశీలించారు. గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుధ్య సమస్య లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. వైస్ ఎంపీపీ పైల సునీల్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అబ్దుల్ రజాక్, నర్సింగరావు, పైల పోతురాజు, పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, ఎంపీటీసీలు తమరాన లోవకృష్ణ, అప్పలరాజు, సబ్బవరపు వెంకునాయుడు, ఉడబాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేవరాపల్లిలో 8 సెం.మీ వర్షపాతం

దేవరాపల్లి: తుఫాన్ ప్రభావంతో దేవరాపల్లిలో 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఏవో వై. కాంతమ్మ, ఏఈవో ఎస్. కిరణ్‌కుమార్ కాశీపురం, చిన నందిపల్లి, మారేపల్లి, దేవరాపల్లి, ఎం. అలమండ గ్రామాల్లో పర్యటించి నీటి ముంపునకు గురైన పంటలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు చేశారు. 550 ఎకరాలకు పైగా వరి పంట నీటి ముంపునకు గురైనట్టు అంచనా వేశారు. వరి కుప్పల మీద పది కేజీల ఉప్పు, 20 కేజీల వరి పట్టు మిశ్రమాన్ని రెండు రోజులుకొకసారి చల్లాలన్నారు. పంట నష్టం వాటిల్లితే ఆర్బీకేలో తెలియజేయాలని రైతులకు ఏవో సూచించారు.

ఉప్పొంగిన కొత్తకోట సర్పానది

రావికమతం: తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట పూర్తిగా నీటి మునిగింది. దొండపూడి, బెన్నవరం గెడ్డ, కొత్తకోట సర్పానది, మేడివాడ, పి.పొన్నవోలులో నల్లకొండ గెడ్డలు పొంగి పొలాలపై నుంచి పారుతున్నాయి. నీట మునిగిన వరి పొలాలను తహసీల్దార్ మహేశ్వరరావు, ఏవో రూప, గ్రామ సచివాలయ సిబ్బంది పరిశీలించారు.

పంట నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిస్తాం

రోలుగుంట: పంట నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని వ్యవసాయ శాఖ నర్సీపట్నం ఏడీఏ శ్రీదేవి తెలిపారు. బుధవారం ఆమె రోలుగుంట వచ్చి పలు గ్రామాలను మండల వ్యవసాయాధికారితో కలసి సందర్శించారు. రైతులతో మాట్లాడి పరిస్థితులు తెలుసుకున్నారు. పూర్తిస్థాయి నివేదికలు తయారు చేసి తనకు అందజేయాలని సిబ్బందికి సూచించారు. రోలుగుంటలో పలు వీధులు జలమయమయ్యాయి. వర్షపు నీరు గదుల్లోకి చేరి బట్టలు, ధాన్యం, గృహ సామగ్రి తడిసిపోయాయి.

వరిపంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

మాకవరపాలెం: మండలంలో నీట మునిగిన వరి పంటను అనకాపల్లి రైతు పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు సీతారామలక్ష్మి, చంద్రశేఖర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొలాల్లో నిలువ నీటిని వెంటనే తొలగించుకోవాలని రైతులకు సూచించారు. ఏవో చిరంజీవి, ఏఈవో శేషునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు. ఇప్పటివరకు కళావిహీనంగా దర్శనమిచ్చే సర్పానది తుపాను వర్షాలకు ఉగ్రరూపం దాల్చింది. ఒక్కసారిగా పొంగి ప్రవహిస్తున్న నదిని స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఈ వర్షాలకు 780 ఎకరాలు పంటకు నష్టం వాటిల్లిందని అధికారులు నివేదిక ఇచ్చారు. పంట నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని ఏవో చిరంజీవి తెలిపారు.



చోడవరం: ఇళ్లపై పడ్డ చెట్లను జేసీబీలతో తొలగిస్తున్న అధికారులు



నాతవరం: ఎస్ఐ రామారావుకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నర్సీపట్నం: గురంధరపాలెంలో నీటితో మునిగిన పంటను వ్యవసాయ సిబ్బందికి చూపుతున్న రైతు



దేవరాపల్లి: మారేపల్లిలో నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఏవో వై. కాంతమ్మ



రోలుగుంటలో నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీదేవి



మాడుగులలో కూరగాయల పంటలను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారి పుష్పలీలావతి

దెబ్బతిన్న ఇళ్లు..

పెద్దిపాలెంలో బిక్కవోలు సూరిబాబు పెంకుటిల్లు పైకప్పు దెబ్బతింది. తూటిపాలకు చెందిన పేలూరి కొండకు చెందిన మిద్దె ఇల్లు కూలిపోయే స్థితికి చేరడంతో సర్పంచ్ గవిరెడ్డి ప్రసాదరావు, కార్యదర్శి గంగరాజు వారిని సురక్ష ప్రాంతానికి తరలించారు. తామరం వద్ద ప్రధాన రోడ్డు మధ్యలో కల్వర్టు కూరుకుపోవడంతో సమీప శ్రీకన్య థియేటర్‌తో పాటు ఇళ్లు ముంపునకు గురయ్యాయి.

చోడవరం రూరల్: నీట మునిగిన పంటల నష్టం తీవ్రతను తగ్గించుకోవడానికి అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తల బృందం పలు సూచనలు చేసింది. బుధవారం చోడవరం మండలం లక్ష్మీపురం, దామునాపల్లి, మైచర్లపాలెం గ్రామాలోపాటు చీడికాడ మండలం వరహాపురం, చినగోగాడ గ్రామాల్లో పర్యటించింది. నీటిముంపునకు గురైన పంటలను పరిశీలించింది. చెరకు ప్రధాన శాస్త్రవేత్త డి.ఆదిలక్ష్మి, కీటక విభాగం ప్రధాన శాస్త్రవేత్త ఆర్.సరిత, విస్తరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డి. ఉమామహేశ్వరరావు నేరుగా అక్కడ రైతులకు తగు జాగ్రత్త చర్యలను వివరించారు. చెరకు పంటలో నీటి నిల్వ చేరకుండా చూడాలని, గాలికొరిగిన చెరకు పంటను నిలబెట్టి చుట్టులుగా చుట్టుకోవాలన్నారు. మినుము, పెసర పంటలలో నిల్వ చేరిన నీటిని తొలగించి ఒక లీటరు నీటిలో ఐదు గ్రాముల ఫెర్రస్‌సల్ఫేట్, 0.5 గ్రాముల సిట్రిక్ యాసిడ్ రెండు గ్రాముల యూరియా కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. ఏఈవో కిరణ్ పాల్గొన్నారు.

మొండిగెడ్డ ప్రాంతం పరిశీలన

కె.కోటపాడు: మండలంలో 123 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ రమేష్‌బాబు తెలిపారు. చౌడువాడ – మల్లంపాలెం గ్రామాల మధ్య మొండిగెడ్డపై నిర్మించిన తాత్కాలిక కాజ్‌వేపై వర్షపునీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ ప్రాంతాన్ని తహసీల్దార్ పరిశీలించారు. ప్రత్యామ్నాయ మార్గమైన కొల్లివీధిలో రాకపోకలను చేయాలని మల్లంపాలెం ప్రజలకు సూచించారు. వైద్య సదుపాయం అవసరమైతే పంపించనున్నట్లు తెలిపారు.

నీట మునిగిన డైవర్షన్ రోడ్డు, వంతెన

బుచ్చెయ్యపేట: మండలంలో బుధవారం 170 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. పెద్దేరు జలాశయం గేట్లు ఎత్తి నీరు విడుదల చేయడంతో వడ్డాదిలో డైవర్షన్ రోడ్డు పూర్తిగా నీటి మునిగిపోగా పక్కనే వంతెనపై నుంచి ప్రవహిస్తోంది. దీంతో బీఎస్ రోడ్డులో తిరిగే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఇక్కడ అనకాపల్లి డీఎస్పీ వి. సుబ్బరాజు, కొత్తకోట, చోడవరం సీఐలు ఇలియాస్ మహమ్మద్, బి. శ్రీనివాసరావు పరిశీలించి చర్యలు చేపట్టారు. బుచ్చెయ్యపేట, రావికమతం ఎస్ఐలు కుమారస్వామి, ఉమామహేశ్వరరావు వంతెనకు ఇరువైపులా తమ సిబ్బందితో బారికేడ్లు ఏర్పాటు చేసి కాపలా కాస్తున్నారు. కుముదాంపేటలో పాలమరశెట్టి వెంకయమ్మ ఇల్లు, ఐయితంపూడిలో ఐయితరెడ్డి గోవింద, రమణ, చినబాబు, కరణం వెంకటలక్ష్మి ఇళ్ల ప్రహరీలు కూలాయి.

తాచేరు, పెద్దేరు నీటి ప్రవాహంతో భారీ గండ్లు

మాడుగుల /మాడుగులరూరల్: దబ్బకుంట–మాడుగుల రోడ్డులో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వంటర్లపాలెంలో మంచినీటి ట్యాంకు తాచేరు నదిలో కుప్పకూలింది. వర్షాలకు తాచేరు, శారదానది, పెద్దేరు, పాలగెడ్డ, చింతగెడ్డ పొంగి ప్రవహిస్తున్నాయి. కూరగాయల పంటలను మండల ఉద్యాన శాఖాధికారి వి. భాను పుష్పలీలావతి పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

చీడికాడ: మండలంలో 152 హెక్టార్లలో నేలకొరిగిన వరి పంటను, మరో 75 హెక్టార్లలో ముంపుకు గురైన పంటను గుర్తించినట్లు, ఇది మరింత పెరిగే అవకాశం ఉందని ఏవో ఎ.కృష్ణవేణి తెలిపారు. వర్షాలు ధాటికి వరహాపురం, తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. చెట్టు కొమ్మలు విరిగి పడి సరఫరాకు అంతరాయం కలగడంతో పునరుద్ధరించినట్లు ఏఈ వెంకటరావు తెలిపారు.

అధికార యంత్రాంగం చర్యలు

చోడవరం: ముంపు ప్రాంతాల్లో ఎంపీడీవో శ్యామ్ సుందర్, తహసీల్దార్ తిరుమలబాబు, ఈవోపీఆర్డీ చైతన్య విస్తృతంగా సహాయక చర్యలు చేపట్టారు. గౌరీపట్నం వద్ద పెద్దేరు నదీ గట్టు పటిష్ట చర్యలు చేపట్టారు. జన్నవరం వద్ద వంతెనపై నీటి మట్టం పెరగడంతో పరిసర గ్రామాల ప్రజల రాకపోకలను నిలిపివేశారు. మండలంలో 11 పెంకుటిళ్లు కూలిపోయాయి. గౌరీపట్నంలో మూడిళ్లు కూలిపోయే పరిస్థితికి రావడంతో నివాసితుల వారిని పునరావాస కేంద్రానికి తరలించారు. చోడవరంలో బాలికల వసతి గృహంలో విద్యార్థినులను సమీపంలో ప్రైవేటు అంతస్తు భవనంలోకి తరలించారు.



మాడుగుల: కింతలి వల్లాపురంలో వంతెనపై గొరిగెడ్డ ప్రవాహం



మాకవరపాలెం: తూటిపాలలో పేలూరి కొండ ఇంటిని పరిశీలిస్తున్న సర్పంచ్, కార్యదర్శి



మాకవరపాలెం : తామరంలో నీటి ముంపులో థియేటర్



మాకవరపాలెం: కొండలఅగ్రహారం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న సర్పానది

అంబేడ్కర్ ఆదర్శప్రాయుడు

ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే గణేష్



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గణేష్



కె.కోటపాడులో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వెంకటేశ్వరరావు



దేవరాపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు

నర్సీపట్నం: డాక్టరు బి.ఆర్.అంబేడ్కర్ అందరికీ ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ 67వ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడి చిత్రపటానికి పూలమాల వేసి ఆయన ఘన నివాళులర్పించారు. రాజ్యాంగంలో అట్టడుగు వారి అభివృద్ధికి అంబేడ్కర్ సముచితస్థానం కల్పించారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కొనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా పాల్గొన్నారు. ఆర్డీవో కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఆర్డీవో హెచ్.వి.జయరాం, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, బీఎస్పీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నర్సీపట్నం కన్వీనర్ బొట్టా నాగరాజు పూలమాల వేసి నివాళులర్పించారు.

కె.కోటపాడు: స్థానిక సబ్ రిజిస్టార్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సబ్ రిజిస్ట్రార్ బి.వెంకటేశ్వరరావు ఘన నివాళులర్పించారు. సీనియర్ అసిస్టెంట్ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లి: స్థానిక అంబేడ్కర్ యూత్ సంఘం ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీ, నాలుగు రోడ్ల కూడలిలో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ పాల్గొన్నారు. తెనుగుపూడి డాక్టరు బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ప్రిన్సిపాల్ కె.వి.ఎల్.ఎన్. నర్సింహరావు ఘన నివాళులర్పించారు.



తెనుగుపూడి గురుకులంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ నర్సింహరావు

పొలాల్లో చేపల వేట

మాడుగుల: మండలంలో గాదిరాయి, పలు గ్రామాల్లో పది పంట చెరువులు తుపాను వర్షాలకు పొంగి ప్రవహిస్తున్నాయి. దాంతో చెరువుల్లో చేపలు పంట పొలాలకు చేరుతున్నాయి. ఆయా గ్రామాలకు చెందిన కొంతమంది రైతులు, జాలర్లు పొలాల్లో చేపల వేట సాగించారు.



గాదిరాయి పొలాల్లో చేపలు పడుతున్న రైతులు

95 మీటర్లకు కోనాం జలాశయ నీటిమట్టం

చీడికాడ: తుఫాన్ ధాటికి ఒక్కరోజులోనే కోనాం జలాశయం నీటిమట్టం 6 మీటర్లకు చేరి 95 మీటర్ల వద్దకు చేరింది. పూర్తి స్థాయి నీటమట్టం 101.25 మీటర్లుకాగా, సోమవారం ఉదయం వరకు 89 మీటర్లు ఉండగా, మంగళవారం సాయంత్రం 6 గంటలకు 6 మీటర్లు పెరిగి 95 మీటర్లకు చేరుకుంది. సోమవారం ఉదయం నుంచి మంగళవారం సాయంత్రం వరకు 153 ఎం.ఎం వర్షపాతం నమోదైంది. ప్రస్తుతం జలాశయంలోకి 2 వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరతున్నట్లు ఏఈ జయరాం తెలిపారు. ప్రస్తుత ఇన్‌ఫ్లో ప్రకారం మరో 3 మీటర్లు పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

పెరిగిన కల్యాణపులోవ నీటి మట్టం

రావికమతం: తుఫాన్ వర్షాలకు కల్యాణపులోవ రిజర్వాయర్ నీటి మట్టం 445 అడుగులకు చేరింది. మూడు రోజులుగా వర్షం కురవడంతో ఇక్కడ 45, 55 మిల్లీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 460 అడుగులు. ఆగస్టు 14వ తేదీ నీటి విడుదల సమయానికి 452 అడుగుల మేర నీరుండేది. వర్షాభావం కారణంగా ప్రధాన కాలువ ద్వారా 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో నీటి మట్టం 440 అడుగులకు పడిపోయింది. తుఫాన్ వర్షాలకు ఏకంగా ఆరడుగుల మేర నీరు చేరింది. ఇన్‌ఫ్లో వంద క్యూసెక్కుల మేర నీరు వస్తుందన్నారు.